# దత్తు తీసికొనబడిన

# (1:5)

టెడ్ మరియు డాన్ స్పెన్సర్ అనేవారు తమ జీవితమంతా తమను ఎరుగనివారి వింత చూపులతోనే గడిపారు. టెడ్‌కు 47, డాన్‌కు 36 ఏండ్లు వయస్సు వచ్చిన మరుగుజ్జివారు. అయితే వారి వికలాంగతలోనే ఒక ప్రత్యేకమైన స్వభావ లక్షణాన్ని కాపాడుకుంటూ వచ్చారు. వారి భౌతిక పరిమితుల మీద దృష్టిని కేంద్రీకరించడానికి బదులు, జీవితాన్ని మార్చే తీర్మానాలనే వారు చేసికున్నారు – శారీరకంగా తమకున్న వాటికంటెను ఎక్కువ సమస్యలుగల బిడ్డలను పెంచుకోసాగారు. చిట్ట చివరికి, దక్షిణ కొరియా, తైవానులకు చెందిన నలుగురు దిక్కులేని వికలాంగులగు పిల్లలను వారు పెంచారు.

టెడ్ వేళాకోళము లేని మనిషి. డానైతే ఉల్లాసముగల వైతొలిగెడు వ్యక్తి. ఎవరైనా తమయందు నమ్మికయుంచి, ప్రేమించి, “నీవు దాన్ని చేయగలవు” అని అనగలిగితే – పిల్లలు – ప్రత్యేకించి ఎవరికే అక్కరలేని పిల్లలు – వికసిస్తారని వారిద్దరు నమ్మేవారు.

స్థానిక సంఘంలో, పాఠశాలలోని క్లాసు రూములో, లేక కార్యాలయం వద్ద ఉన్నవారికి దత్తు తీసికొనడంవలన కుటుంబ సభ్యులు ఎందరయ్యారో మనం ఎరిగియున్నట్టయితే ఆశ్చర్యపడియుండవచ్చు. మీలో కొందరికి దత్త స్వీకారంవలన తమ్ముళ్లు, చెల్లెళ్లు ఉండవచ్చు. మీలో కొందరు పిల్లలను దత్తుతీసికొనియుండవచ్చు. మీలో కొందరు పెంచుకున్న పిల్లలైయుండవచ్చు.

దేవుని కుటుంబంలోనికి వచ్చే ఒకే మార్గం దత్త స్వీకారం ద్వారా. మానవ జాతిలో సభ్యుడవయ్యున్నంత మాత్రాన దేవుని కుటుంబానికి చెందినవాడవనే అర్థం కానవసరం లేదు. దేవుని కుటుంబంలోనికి ప్రవేశం దత్తు స్వీకారంవలన మాత్రమే జరుగుతుంది.

దేవుని కుటుంబంలోనికి స్వీకరించబడడాన్ని గూర్చి మూడు వేరైన క్రొత్త నిబంధన లేఖన భాగాలు మాట్లాడతాయి (రోమా 8:15, 23; గలతీ. 4:5; ఎఫెసీ. 1:5). ఇవన్నీ పౌలు యొక్క రచనలలోనే కన్పిస్తాయి. ఎఫెసీ. 1:5 యిలా అంటుంది, “తన చిత్త ప్రకారమైన దయాసంకల్పముచొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని ... .”

ప్రతి క్రైస్తవునికి దేవుడు తండ్రియై ఉన్నాడు. మనం దత్త స్వీకారం చేయబడ్డాం. జీవితంలోని సవాలులలో మహా గొప్పది ఈ వాస్తవాన్ని గట్టిగా చేపట్టి మన జీవితాల్లో అది పని చేయునట్టుగా చేయడమేనని నేను తలంచుతాను.

ఎక్కడ నొక్కి పలకాలో అక్కడ జె. ఐ. పాకర్ నొక్కి యిలా పలుకుతున్నాడు:

> ఒక వ్యక్తి క్రైస్తవ్యాన్ని ఎంత బాగా అర్థం చేసికొన్నాడో నీవు తీర్మానించగోరితే, దేవుని బిడ్డయై ఉన్న ఆలోచనను, దేవుడు తనకు తండ్రియై ఉన్నాడనే భావనను అతడు ఎంతగా గ్రహించాడో కనుక్కో. తన ఆరాధనను, ప్రార్థనలను, జీవితంపై తనకున్న దృక్పథమంతటిని అది ప్రేరేపించి వశపరచుకొనకుండ ఉన్నట్టయితే, నిజానికి అతడు క్రైస్తవ్యాన్ని సరిగ్గా గ్రహించినవాడై ఉండడు.[1]

మానవాళికి అనుగ్రహింపబడే ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములన్నిటిలో అత్యంత ఘనమైనది దేవుని కుటుంబంలోనికి స్వీకరింపబడడమే.

## దత్తు తీసికొనబడడం: దాని అర్థం

"యేసుక్రీస్తు ద్వారా (దేవుడు) తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తనకోసము నిర్ణయించుకొని ..." అని పౌలు వ్రాశాడు (1:4బి, 5). క్రైస్తవులను సూచించడంలో, "స్వీకరించుట" (గ్రీకు.: *huiothesia*) అనే పదాన్ని పౌలు ఎందుకు ఉపయోగించాడు? మనం ఎవరిమో, దేవుడు మనకు ఏమి చేశాడో అనేవాటిని అర్థం చేసికొనడానికి, స్వీకరించడం అనేది మనకు ఎలా సహాయపడుతుంది?

తమ ప్రపంచంలో నిలిచి తన పాఠకులు గ్రహించగల ఒకదాని మీద పౌలు మాట్లాడుతున్నాడు. దత్తు తీసికొనేదానికి సంబంధించిన పద్ధతులు ఆకర్షణీయమైన సంఘటనలుగా ఉంటాయి. ఆ కార్యానికి సంబంధించిన విస్తారమైన ఏర్పాట్లే దాని ప్రాధాన్యతను నొక్కి పలుకుతాయి. దత్త స్వీకారపు కార్యం పూర్తి అయినప్పుడు, అలా దత్తు తీసికొనబడినవానికి నూతనమైన గుర్తింపు వస్తుంది.

> దత్త స్వీకారం పూర్తి అయినప్పుడు, అది నిజంగా పూర్తి అయినట్టే. దత్తు తీసికొనబడిన వ్యక్తి తన నూతన కుటుంబంలో న్యాయమైన కుమారునికి ఉండే సమస్త హక్కులు కలిగినవాడై ఉంటాడు. తన పాత కుటుంబంలో ఉన్న సమస్తమైన హక్కులు కోల్పోయినవాడౌతాడు. చట్టం యొక్క దృష్టిలో అతడొక నూతన వ్యక్తి. అతడు ఎంత క్రొత్తవాడంటే, తన గత కుటుంబానికి ఉన్న అప్పులన్నీ, బాధ్యతలన్నీ అవి ఎన్నడూ లేనివైనట్టు రద్దు చేయబడతాయి.[2]

దేవుడు దీనిని మనకొరకు చేశాడన్న విషయాన్ని మనం ఎరగాలని పౌలు కోరుతున్నాడు. దత్త స్వీకారానికి ముందు ఆత్మ సంబంధమైన బానిసలమే కాక మరేమీ కాదు. మనం భయంకరమైన ఋణంలో ఉన్నాం – పాపమునకు అమ్మబడి, చావుకు లోనైనవారమై, నిరీక్షణ లేనివారము, లోకంలో దేవుడు లేనివారమైయున్నాం. మనలను విడిపించి, రక్షించి, మనలను తనకు కుమారులనుగా స్వీకరించునంతగా దేవుడు ప్రేమించాడు!

తన కుమారుని ద్వారా దేవుడు దీనిని మనకొరకు చేశాడు. ప్రభువైన యేసును సూచించుతూ యోహాను 1:12 యిలా అంటుంది, "తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి, దేవుని పిల్లలగుటకు

ఆయన అధికారము అనుగ్రహించెను ..." దేవుని పిల్లలయ్యే హక్కు ప్రతి వ్యక్తికి అనుగ్రహింపబడలేదు. తమ పూర్ణ నమ్మిక ప్రభువైన యేసునందు ఉంచినవారు మాత్రమే నిజమైన దేవుని పిల్లలు కాగలరు.

గలతీ. 4:4, 5 యిలా అంటుంది, "అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీయందు పుట్టి, మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను." మనము విమోచింపబడి దేవుని కుటుంబంలోనికి దత్త స్వీకారం చేయగలుగు నట్లు దేవుడు క్రీస్తును పంపాడు.

దత్త స్వీకారమేమి? దాని అర్థమేమి? దత్త స్వీకారమంటే ఒక వ్యక్తిని గతంనుండి విడుదల చేయడం. వానిని తన కుమారుడని దేవుడు చెప్పుకొనడం అనేదాన్ని దత్త స్వీకారమంటారు. విమోచించేదానికంటె మించి దేవుడు మనకొరకు చేసేది దత్త స్వీకారమే.

బానిసల యిండ్లగుండా పోతూ ఒకప్పుడు అబ్రాహాం లింకన్ ఒక యౌవన బాలిక (యువతి) అమ్మబడడం చూచాడు. అతని హృదయం కరిగిపోయింది. అతడు వేలంలో ఆమెను పాడాడు, చివరికి ఆమె తనకు చెందినదైపోయింది. అతడు డబ్బు చెల్లించిన మీదట, "నీవు స్వతంత్రురాలవు" అని అతడు ఆమెతో అన్నాడు.

"దానికి అర్థమేమి?" అని ఆమె అడిగింది.

"దానికి అర్థం నీవు స్వతంత్రురాలవని" లింకన్ బదులిచ్చాడు.

"అంటే నేను ఎలా ఉండ కోరుకుంటానో అలా ఉండవచ్చా?"

"అవును, నీవు ఎలా కావాలని కోరుకుంటావో అలాగే ఉండవచ్చు."

"నేను ఎక్కడికి వెళ్లగోరతానో అక్కడికి వెళ్లవచ్చునని దాని భావమా?"

"అవును, నీవు వెళ్లగోరే ఎక్కడికైనా వెళ్లవచ్చు."

తన కండ్లలోగుండా నీళ్లు కారుతూ ఉండగా, ఆ యువతి లింకన్‌వైపు చూచి, "నేను నీ వెంటే వస్తాను" అని అన్నదట.

దేవుడు దానిని నీకు చేశాడు. ఆయన నిన్ను స్వతంత్రునిగా చేశాడు. దానికి మించి, ఆయన నిన్ను దత్తు తీసికొని తన బిడ్డగా చేసుకున్నాడు.

## దత్త స్వీకారము: దాని ప్రత్యేకానుకూలతలు

### ప్రత్యేకానుకూలత ఒకటి: తండ్రి ప్రేమ

"యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని ..." మన కొరకైన దేవుని ప్రేమ దత్త స్వీకారంలోనే వ్యక్తపరచబడింది.

మనపట్ల దేవుని ప్రేమ ఎంత విస్తారమైయుందో గ్రహించుకొన మొదలుపెట్టదానికి క్రొత్త నిబంధన తోడ్పడుతుంది. ఆయన అద్భుతమైన ప్రేమను కొలతవేయడానికి అది మనకు రెండు కొల కర్రలనిస్తుంది. మొదటిది సిలువ: "అయితే దేవుడు మనయెడల

తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8). దేవుడు నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నాడో తెలుసుకొనగోరుతున్నావా? గొల్గొతావైపు చూడు. నీ కొరకైన దేవుని ప్రేమను కొలతవేయ జూస్తున్నావా? కల్వరిపై దృష్టిని కేంద్రీకరించు.

దేవుని ప్రేమను కొలవడానికి యివ్వబడిన రెండవ కొల కర్ర దేవుని కుమారత్వపు వరము. "మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమ ననుగ్రహించెనో చూడుడి; మనము దేవుని పిల్లలమే ..." (1 యోహాను 3:1). దత్త స్వీకారం ద్వారా, ఆయన ప్రేమను మనం అనుభవిస్తాం. ఆయన మనలను రక్షించడానికి, క్షమించడానికి, లేక కుమారులనుగా స్వీకరించడానికి ఏ హేతువు లేదు. ఈ మూడింటిని దేవుడు జరిగించింది కేవలం ప్రేమను బట్టియే.

ఒక మనుష్యుడు ఆస్ట్రేలియాలో ఉపన్యాస పర్యటన చేస్తున్నాడు. ఒక ఉదయాన పనిపిల్ల హోటల్ రూమ్ శుద్ధి చేస్తుండగా, చదువుకొనడానికి అతడు హాలులోనికి వెళ్లాడు. అతడు తన నోట్సును తెరిచి పరిశీలించుకొంటూ ఉండగా, వైలన్ సంగీతాన్ని విన్నాడట. అది అతని ఏకాగ్రతను పాడుచేసింది, దానితో అతనికి కోపం వచ్చింది. చివరికి, అతడు తిరిగి గదిలోనికి వెళ్లి ఆ శబ్దాన్ని గూర్చి పని పిల్లకు వివరించాడు.

"ఆ వైలన్ను వాయించుతున్నదెవరో మీకు తెలుసా?" అని ఆమె అతనిని అడిగింది.

"లేదు, ఎవరిది?"

"అది యెహూది మెనూహిన్, లోక ప్రసిద్ధిగాంచిన వైలనిస్ట్! ఈ రాత్రి కచ్చేరికి అతడు ప్రాక్టిస్ చేస్తున్నాడు."

ఆ మనుష్యుడు ఆశ్చర్యపోయాడు. దాన్ని నమ్మలేకపోయాడు. అతడు వెంటనే ఒక కుర్చీ తీసుకొని తిరిగి హాలులోనికి వెళ్లి కూర్చుండి ఆ గొప్ప కళాకారుడు చేస్తున్న ప్రాక్టిస్‌ను ఆలకిస్తూ ఉన్నాడు. తాను విన్నదాన్ని గూర్చి అతడు, "అది బహు ఆశ్చర్యకరమైన కచ్చేరి – అంత రమ్యమైన సంగీతాన్ని నేను ఎన్నడూ వినలేదు – ఎవరు వాయిస్తున్నారో నేను గ్రహించగా."

నీవు దేవుని బిడ్డవైయుంటే, నీ జీవితంలో ఆ సంగీతాన్ని విను. నీవు దాన్ని పోగొట్టుకుంటూ ఉండవచ్చు. అది ఎల్లప్పుడు మ్రోగుతూనే ఉంటుంది, వినబడాలని కోరుకుంటుంది. మనం విని ఆనందించాలని అది మనకొరకు గాలిని నింపుతుంది. అది దేవుని ప్రేమా సంగీతం. ఆ సంగీతం చేస్తున్నది ఎవరు అని మనం గ్రహించగలిగి నప్పుడు, మన జీవితాన్ని అదే విధంగా మరెన్నడూ చూడము.

### ప్రత్యేకానుకూలత రెండు: పడకుండ నిలబెట్టే నిరీక్షణ

దేవుని కుటుంబంలో మేలైనది యింకా ఎల్లప్పుడు రావలసియే ఉంది. క్రైస్తవ్యము నిరీక్షణతో కూడిన మతమైయుంది. దేవుని పిల్లలంగా, నమ్మశక్యముకాని స్వాస్థ్యం కొరకు మనం నిరీక్షిస్తున్నాం. అది స్వయంగా దేవునిచేతనే ఉత్తరవాదం కలిగించబడింది (1:14) అంటే గ్యారంటీ యివ్వబడింది.

దేవుని పిల్లలంగా, క్రీస్తు మహిమలో పాలుపొందుతామనే నిరీక్షణను కూడా మనం

కలిగియున్నాం (రోమా 8:17). మొదటి యోహాను 3:2 యిలా అంటుంది, "ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమైయున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము."

పరలోకమని పిలువబడే స్థలంలో, మహా ఘనమైన కుటుంబపు తిరిగి కలయిక కొరకు దేవుని పిల్లలంగా మనం నిరీక్షిస్తాం. అక్కడ దేవుని కుటుంబంలో ప్రభువుతో కూడ నిరంతరం మనముంటాం (1 థెస్స. 4:17). మనం తరచుగా పాడే పాటను ఆలోచించు.

కొన్నిసార్లు మనం కలిసి నవ్వుతాం
    కొన్నిసార్లు ఏడుస్తాం;
కొన్నిసార్లు మనం కలిసి పంచుకుంటాం,
    హృదయ వేదనలు నిట్టూర్పులు;
కొన్నిసార్లు మనం కలిసి కలలు కంటాం,
    అది ఎలాగుంటుందోనని
మనమందరం పరలోకానికి చేరుకున్నప్పుడు,
    దేవుని కుటుంబం.[3]

గళమెత్తి ఏకంగా మనం ఈ పాట పాడతాం. ఎందుకంటే మనం స్వీకరించబడడంలో గల ఒక ప్రత్యేకానుకూలత మన నిరీక్షణయే.

## దత్త స్వీకారము: దాని బాధ్యతలు

"క్రైస్తవ జీవితం సంపూర్ణంగా దాని షరతులపై గ్రహించవలసి ఉంటుం"దని దత్త స్వీకారాన్ని గూర్చి జె. ఐ. పేకర్ అన్నాడు.[4] తాను ఎవరైయున్నాడో – అంటే తాను దేవుని కుమారుడనని ఎరిగినందున యేసు తాను జీవించినట్టు జీవించాడు. దేవుడు మనకు తండ్రియని, మనము దేవుని పిల్లలమనే తెలివి మన జీవిత విధానాన్ని రూపు దిద్దవలసి ఉంటుంది. కొండమీద ప్రసంగంలో ప్రభువు దీనిని నొక్కి పలికాడు. దేవుని తండ్రిగా ఎరిగినవారికి ప్రభువైన యేసు కొండమీద ప్రసంగంలో ఏమి చెప్పాడో గమనించు.

1. **మనం దేవుని పిల్లలంగా జీవించాలి**. దేవుని అనుకరించడంవలన మనం దీన్ని జరిగిస్తాం. ప్రభువు యిలా అన్నాడు: "నీ పొరుగువాని ప్రేమించి, నీ శత్రువును ద్వేషించుమని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా; నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులైయుందునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి ..." (మత్తయి 5:43–45).

దేవుని కుమారునిగా జీవించడమంటే దేవుని అనుకరించడమని అర్థం. తండ్రికి ఘనత తెచ్చుట అని కూడా దాని భావమైయుంటుంది. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారియెదుట మీ వెలుగు

ప్రకాశింపనియ్యుడి" అని మనం చదువుతాం (మత్తయి 5:16).

ఆయనను అనుకరించడంవలనను, ఆయనకు మహిమ తెచ్చుటవలనను, మనుష్యులను కాక, ఆయనను ఎల్లప్పుడు సంతోషపెట్టుటవలనను మనం దేవుని పిల్లలంగా జీవిస్తాం. "మనుష్యులకు కనబడవలెనని వారియెదుట మీ నీతి కార్యము చేయకుండ జాగ్రత్తపడుడి; లేనియెడల పరలోకమందున్న మీ తండ్రియొద్ద మీరు ఫలము పొందరు" (మత్తయి 6:1).

2. **దేవుని పిల్లలంగా మనం ప్రార్థించాలి.** స్వీకరింపబడిన పిల్లలంగా, "పరలోకమందున్న మా తండ్రీ" అంటూ మనం దేవునికి ప్రార్థించాలి (మత్తయి 6:9). మన తండ్రి యెదుట అదే విషయం పదే పదే మనస్సు పెట్టకుండ అడగడాన్ని మానాలి (మత్తయి 6:7, 8). స్వతంత్రంగాను, ధైర్యంగాను మనం ప్రార్థించవచ్చు: "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును" (మత్తయి 7:7).

3. **దేవుని పిల్లలంగా మనం నమ్మికయుంచాలి.** అనవసరమైన చింత, లేక ఆలోచన లేకుండ మనం బ్రదుకవచ్చు. మన నిజమైన ప్రతి అవసరతను మన తండ్రి తీర్చుతాడని మనం కేవలం నమ్మికయుంచాలి. "ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" (మత్తయి 6:32, 33).

దత్త స్వీకారానికి దాని ప్రత్యేకానుకూలతలు ఉన్నాయి, మరియు దానికి దాని బాధ్యతలు కూడా ఉన్నాయి. మన తల్లిదండ్రులు మనతో ఎప్పుడో ఒకప్పుడు కూర్చుండి కుటుంబ గౌరవం నిలబెట్టవలసిందిగా ప్రోత్సహించినట్టు – మనలో ఎక్కువ మందికి జ్ఞాపకం ఉండవచ్చు.

దేవుని కుటుంబానికి వచ్చేసరికి అది మరి ఎక్కువగా అవసరమై ఉంటుంది. మన ప్రత్యేకానుకూలతలతో మనకు బాధ్యతలు కూడా వస్తాయి. ఒకటి లేకుండ మరియొకటి మనం కలిగియుండలేం. దేవుని కుటుంబంలోనికి స్వీకరించబడడంతో, దేవుని కుటుంబంలోని సభ్యులుగా మసలుకోవలసిన బాధ్యత కూడా వస్తుంది.

## ముగింపు

"జీవితంలో మనం ఎలాటి పరిస్థితుల గుండా వెళ్లవలసి వచ్చినా, దేవుడు మనకొరకు భద్రం చేసి ఉంచిన మహా ఘనమైన భవిష్యత్తుకు అవి ఏ మాత్రం పోల్చదగినవి కాదని నా అభిప్రాయం. దేవుని కుమారుల యొక్క ప్రత్యక్షత కొరకు సృష్టి యావత్తు తేరి చూస్తు మిగుల ఆశతో కనిపెట్టుతుంది" (రోమా 8:18, 19; అన్నట్టు జె. పి. ఫిలిప్ తర్జుమా తెలిపింది). సృష్టి యావత్తు – పరలోకపు దూతగణంతో పాటు ఒకే గొప్ప ప్రేక్షక కూటంగా చేరి తెర తీయబడే దానికొరకు ఊపిరి పీల్చకుండ వేచియున్నట్టున్నారు. యుగాంతమున చివరిగా అది జరిగినప్పుడు, సృష్టియావత్తు ఆశ్చర్యంతో ఊపిరి పీల్చుకుంటుంది. తన దత్త పుత్రులకు దేవుడు మహిమనిచ్చినప్పుడు విశ్వమంతటికి ఆ శబ్దం వినిపిస్తుంది.

సూచనలు

[1]J. I. Packer, *Knowing God* (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973), 182. [2]William Barclay, *The Letters to the Galatians and Ephesians*, The Daily Study Bible Series, rev. ed. (Philadelphia: Westminster Press, 1976), 80. [3]Lanny Wolfe, "God's Family," *Songs of Faith and Praise* (West Monroe, La.: Howard Publishing Co., 1994), 744. © 1974 Lanny Wolfe Music / ASCAP. All rights controlled by Pathway Music, P. O. Box. 2250, Cleveland, TN 37320. Used by permission. [4]Packer, 190.

## శ్రమలను దృష్టిలో ఉంచుకొని

"క్షేమమనేది అపాయం లేకపోవడం కాదు, ప్రభువుయొక్క ప్రసన్నత ఉండడం."

"బలీయమైన విశ్వాసాన్ని నేర్చుకునే ఒకే మార్గం గొప్ప శ్రమను సహించడమే. తీవ్రమైన పరీక్ష నడుమ స్థిరంగా నిలిచియుండడంవలన నేను విశ్వాసాన్ని నేర్చుకొన్నాను" అని జార్జి ముల్లర్ అన్నాడు.

"క్రీస్తుతో నావలో ఉండి, తుఫానువైపు చిరునవ్వు వేస్తాను."

"శ్రమలనే ఇత్తడిలోనుండి విజయమనే బూరలను దేవుడు రూపొందిస్తాడు."

"ఉక్కు అంటే ఇనుము అగ్నితో కూడికయై ఉంది."

"నేను నీకు బాధ కలిగించవచ్చును, గాని నేను నీకు హాని చేయను" అని ఒక శస్త్ర చికిత్స వైద్యుడు ఒక రోగితో అన్నాడు.

"దేవుడు చూచినట్టు మనం చూడగలిగితే, ఏమి మనం వేడుకుంటామో దానినే మనం పొందుతున్నాం."

"మన అవసరతలకు దేవుడు ఎన్నడు బహు ఆలస్యంగా గాని, బహు తక్కువైనదానితో గాని రాడు."